# లాంఛనప్రాయం



## వసుంధర

**రమణి** నా అభిమాన రచయిత్రి.

మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో సగానికి సగం స్త్రీలవి. వారి సమస్యలు పరిష్కరించబడితే సమాజం ముందుకు నడుస్తుంది.

రమణికి స్త్రీల సమస్యలు బాగా తెలుసు. ఆమె అవగాహన అద్భుతం. పాఠకుల మనసుల్లోకి సూటిగా దూసుకునిపోయే విధంగా సమస్యలను గ్రంథస్తం చేయడం ఆమె ప్రత్యేకత.

వరకట్నం సమస్యపై ఆమె రచన చదివినప్పుడు నాలో ఆవేశం పొంగిపొరలి ఆమె పేరిట ఉత్తరం రాసాను.

విశేషమేమిటంటే ఆమె నాకు వెంటనే జవాబు వ్రాసింది.

"రచనలుచేయడం నాకు దైవదత్తమైన శక్తి. ఇందులో నా గొప్పతనమేమీలేదు నేను చేస్తున్న కృషి ఏమీలేదు. నా ఆలోచనల్ని పదిమంది పాఠకులతో పంచుకుంటున్నాను. నా అభిప్రాయాలతో మీరు ఏకీభవించినందు నాకు చాలా సంతోషంగా ఉన్నది"-అని ఎంతో వినయంగా వ్రాసిందామె.

వినయం గొప్పవారి లక్షణం. ఆ ఉత్తరం నాకు రమణిపై గౌరవాన్ని పెంచింది.

ఆమెను నేను అక్కా అని పిలవాలనుకున్నాను. అంగీకరించింది. ఆనాటి నుంచీ ఉత్తరాలతో మామధ్య అనుబంధం పెంపొందసాగింది. ఆమెకు అన్నలు, తమ్ముళ్ళులేరుట. అక్కా పిలిచి

నందుకు ఎంతో సంతోషించింది. అప్పు డప్పుడు ఉత్తరాలలో ఆమె భర్త కూడా నన్నడినట్లు రాస్తూండేది.

ఆమె ఉంటున్న ఊరు మా ఊరుకి వంద కిలో మీటర్ల దూరం. కానీ వెళ్ళి ఆమెను కలుసుకుని మాట్లాడాలంటే గుండెలో ఏదో బెరుకు. భయం.

ఆమె చాలా గొప్పది. ఆమె అభిప్రా యాలు గొప్పవి. ఆమె రచనలుగొప్పవి. ఆమె రచనలు చూస్తుంటే చాలా మంది రచయితల్లా ఏదో లాంఛన ప్రాయంగా రచనలు చేస్తున్నట్లు అనిపించదు. సమ స్యలామె హృదయాన్ని కదిలించగా అక్కడ మథనం జరిగి ఆవేదన నుండి పుట్టిన రచనలవి అనిపిస్తుంది.

ఆమెను నేను కలకుని మాట్లాడాలంటే ఏదైనా ఒక విశేషమైన పని చేయాలి. ఆమెకా విషయం గర్వంగా చెప్ప కోవాలి. అప్పుడామె నన్ను అభినందిం చాలి.

అందుకు అనువైనది నాపెళ్ళి ఒక్కటే. ఇంట్లో నాపెళ్ళి ప్రయత్నాలు జరుగు తున్నాయి. ఇలా బియ్యే పాస్కాగానే అలా బ్యాంకు ఉద్యోగం-అదీ ఉంటున్న ఊళ్లోనే వచ్చింది నాకు. అందుకని పిల్ల నిస్తామంటూ చాలా మంది మా యింటి చుట్టూ తిరుగుతున్నారు మానాన్నగారు నన్ను వేలంపాటకు పెట్టినట్లె!

అప్పుడు నాకు రమణి వ్రాసిన కథ గుర్తుకు వచ్చింది.

ఆ కథలో కట్నం తీసుకునే వాళ్ళుఎన్ని విధాలుగా తమ తప్పిదాన్ని సమర్థించు కుంటారో వివరించబడింది.

కట్నంకోసం ఒకరిని బాధించకూడదు కానీ వారు సంతోషంగా ఇస్తే పుచ్చుకో వచ్చునని కొందరంటారు. సంతోషంగా కట్నం. ఎవరివ్వగలరు? ఉన్నవారు మాత్రమే. ీ. అందే వరుడు సంతోషంగా కట్నమివ్వగల అత్తవారినే వెతుక్కోవాలి అందువల్ల లేనివారి గతి అంతే!

స్త్రీని స్త్రీగా మాత్రమే స్వీకరించడం మగతనం అనిపించుకుంటుంది. స్వశక్తితో తన కుటుంబాన్ని పోషించు కోగలవాడే మగవాడు అనిపించుకుం టాడు. అలాంటి మగవాళ్ళు లోపించడం వల్ల మన సమాజం మగతనంలేనిదైంది. ఇంత పవర్ ఫుల్గా రమణి తన కథల్లో చెప్పిన విషయాలు నా మీద ప్రభావం చూపించకపోతే నేనామె అభిమాని నెలా గౌతాను?

ఈ విషయమై ఇంట్లో నేను చాలా ఘర్షణ పడవలసి వచ్చింది. చివరకు నా పట్టుదల నెగ్గింది.

శుభలేఖలు అచ్చువేయించాక స్వయంగా నా అభిమాన రచయిత్రి కివ్వాలనుకుని ఒక ఆదివారంనాడు ఆమెఊరువెళ్ళాను నేను వెళ్ళేసరికి ఆమె ఇంట్లోనే ఉన్నది. నేను ఆమె ఇంటిని చూడడంలేదు. పరి సరాలను గమనించడంలేదు. ఆమెనే చూస్తున్నాను.


పత్రికల్లో ఆమె ఫొటోలు చాలాసార్లు చూశాను. ఆమె రూపంపై ఒక అభిప్రా యం ఏర్పడింది. కానీ స్వయంగాచూస్తే ఆ థ్రిల్ వేరు.

ఆమెలో రాచఠీవి ఉన్నది.

పచ్చని ఛాయ. ఎత్తయిన విగ్రహం, చిరు నవ్వుతోకూడిన ముఖం. తలపై కిరీటం లేదుకానీ ఆమె ఒకమహారాణిలాఉన్నది.

"ఎవరండీ మీరు?'' అన్నదామె.

"అక్కా!" అన్నాను అప్రయత్నంగా.




ఆమె ఆశ్చర్యంగా "మీరు....మీరు..."

నేను నవ్వాను. నా నవ్వుతో ఆమెకి అంతా అర్థమైంది. ఆమె మొహం వెయ్యి వోల్టుల బల్బులా వెలిగింది. నన్ను సాదరంగా లోపలకు ఆహ్వానించింది.

నన్నెంతో ఆప్యాయంగా, ఆత్మీయుడిలా ఆదరించింది. ఆరోజు భోజనం కూడా అక్కడే.

"అక్కా! మీకు నామీద ఎంత అభిమానం!" అన్నాను.

"నాకు తమ్ముళ్ళులేరు. అక్కగా నన్నభిమానించిన నీ రాకకోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్నాను." అన్నదామె ఎంతో ఆప్యాయంగా తాంబూలం తెచ్చిఇస్తూ.

ఆరాత్రి ఆమెభర్తా, నేనూ, ఆమె వెన్నెల్లో కూర్చున్నాం.

ఆమెకు వచ్చిన పని చెప్పాను. ఆమె రచనలు నాపై ఏవిధంగా ప్రభావం చూపించినదీ చెప్పి- "అక్కా! నాపెళ్ళికి మీకుటుంబమంతా తప్పకుండా రావాలి" అన్నాను.

"నీ పెళ్ళికి రాకుండా నేనెలా ఉంటాను? నా జీవితంలో తీరనికోరిక మాత్రం ఒకటున్నదికదా" అంది నవ్వుతూ.

"ఏమిటక్కా" అన్నాను.

"నాకు తోడబుట్టిన వాళ్లులేరు. ఆడపడుచుగా ఏ పెళ్ళికి వెళ్ళలేదు. ఏదో లాంఛన ప్రాయంగా అక్కా అని పిలవడంకాదు. నాకు ఆడపడుచు లాంఛనాలిప్పిస్తేనే నేను నీ పెళ్ళికి వస్తాను. అప్పుడేకదా-నేను అసలయిన ఆడపడుచునౌతాను" అన్నదామె.

నేను తెల్లబోయి ఆమెవంక చూశాను. ఆమె ముఖంలో సరదాగా ఆ మాట అన్నానన్న భావన కనపడలేదు.

మరుసటి రోజు ఆమెకి లాంఛన ప్రాయంగా మరోమారు రమ్మనిచెప్పి మా ఊరు బయల్దేరాను. *